సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



నైట్ షెల్టర్ ఏదీ?

వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత జనాల రాకపోకలు బాగా పెరిగాయి. 8లో▸



జాతరకు భారీ బందోబస్తు

ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. 8లో▸



కల్వర్టుకు మోక్షమెన్నడో?

వర్షాల ధాటికి ఏడాది క్రితం మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై కూలిన కల్వర్టుకు నేటికీ మోక్షం లభించలేదు. 9లో▸

ఎన్నికల కాలం..



దోమ గ్రామ పంచాయతీ భవనం

ఒకదాని వెంట మరొకటి

- వచ్చే ఏడాది జూలై దాకా ఓట్ల పండుగే
- పంచాయతీ ఎన్నికల కోసం అధికారుల కసరత్తు
- జనవరి 31తో ముగియనున్న గడువు
- ఫిబ్రవరి 2న కొత్త పాలకవర్గాలు కొలువుదీరాలి
- జిల్లాలో 565 గ్రామ పంచాయతీలు
- పోటీకి సిద్ధమవుతున్న నేతలు

వికారాబాద్: వచ్చే ఏడాది జనవరి నుంచి ఓట్ల పండుగ ప్రారంభం కానుంది. ఈ శీతాకాలం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ ఎన్నికలు మొదలు వచ్చే సంవత్సరం వర్షాకాలం వరకు ఎన్నికల సందడి కొనసాగనుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వచ్చే నెల నుంచి మరో ఆరేడు నెలల పాటు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే 2023–24ను ఎలక్షన్ ఇయర్‌గా పేర్కొనవచ్చు. వచ్చే నెల జనవరి 31తో పంచాయతీ సర్పంచుల గడువు ముగియనుంది. ఫిబ్రవరి 2న కొత్త సర్పంచులు కొలువుదీరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీపీఓలకు ఆదేశాలు అందాయి. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

కసరత్తు షురూ..

జిల్లాలో 565 గ్రామ పంచాయతీలు ఉండగా మండలాల వారీగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయగా వాటికి అదనంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని బూత్‌లు అవసరం అవుతాయి అనే వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు బూతులు ఏర్పాటు చేశారు. అయితే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా బూత్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంకా ఎన్ని పోలింగ్ స్టేషన్లు అవసరం, ఎంత మంది సిబ్బంది అవసరం వంటి వివరాలు సేకరిస్తున్నారు. ఓటర్లను సైతం వార్డుల వారీగా విభజించే కసరత్తు చేస్తున్నారు.

సమరానికి సిద్ధమవుతున్న నేతలు

జిల్లాలో 565 గ్రామ పంచాయతీలు ఉండగా వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను ఆ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,850 వార్డులు ఉండగా అందుకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆశావహులు పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

మండలాల వారీగా జీపీలు

మండలం	జీపీల సంఖ్య
బంట్వారం	11
బషీరాబాద్	36
బొంరాస్‌పేట	47
ధారూరు	32
దోమ	36
దౌల్తాబాద్	33
కొడంగల్	26
కోట్‌పల్లి	18
కుల్కచర్ల	44
మర్పల్లి	27
మోమిన్‌పేట	28
నవాబుపేట	32
పరిగి	37
పెద్దేముల్	37
పూడూరు	31
తాండూరు	33
వికారాబాద్	21
యాలాల	37
మొత్తం	566


56ఏళ్ల తర్వాత అధికార యోగం



రేవంత్‌రెడ్డి



అచ్యుతారెడ్డి (ఫైల్)



- నాడు అచ్యుతారెడ్డికి మంత్రి పదవి
- నేడు ముఖ్యమంత్రిగా రేవంత్

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి 56ఏళ్ల తర్వాత అధికార యోగం లభించింది. 1967లో నాగర్‌కర్నూల్ నుంచి ఇక్కడికి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన అచ్యుతారెడ్డికి అప్పట్లో మంత్రి పదవి దక్కింది. ఆయన కొంత కాలం పాటు రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆప్పటి నుంచి ఇప్పటి వరకు కొడంగల్‌కు మంత్రి పదవి లభించలేదు. ప్రస్తుత ఎన్నికల్లో కొడంగల్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్ ఏకంగా ముఖ్య మంత్రి అయ్యారు. సుదీర్ఘ కాలం తర్వాత రాష్ట్రంలో అత్యున్నత స్థానం అధిరోహించే అవకాశం కొడంగల్‌కు దక్కడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని భావిస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 16 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ పార్టీ ఆరు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు నాలుగు సార్లు గెలిచారు. 1996లో జరిగిన ఉప ఎన్నికలో టీడీ పీ గెలిచింది. 2018లో మొదటిసారి కొడంగల్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు.

ఆరు గ్యారంటీలపై తొలి సంతకం

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారు.

న్యూస్‌రీల్

చెన్నై క్రీడా పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి సాయికుమార్‌తో కోచ్ తదితరులు

కొడంగల్ రూరల్: పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి సాయికుమార్ ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం చదువుతున్న అల్వాల సాయికుమార్ గురువారం నిర్వహించిన షాట్ పుట్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన సాయికుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జే రాజారాం, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు. త్వరలో చెన్నై యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలకు సాయికుమార్ ఎంపికయ్యారని కళాశాల సిబ్బంది తెలిపింది.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



మిట్టకోడూర్ కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

పరిగి: వరి ధాన్యం కొనుగోలులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ హెచ్చరించారు. గురువారం మండలంలోని మిట్టకోడూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. గోనె సంచులు, టార్పాలిన్లు, కాంటాలు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసే ముందు తేమ శాతాన్ని పరిశీలించాలని ఆదేశించారు. బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీకుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు



షాద్‌నగర్: ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఎల్బీ స్టేడియంలో ప్రమాణస్వీకారం తర్వాత ఆయనను ప్రత్యేకంగా కలిశారు.సీఎంకు శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సిబ్బంది దందాకు డీలర్లదే బాధ్యత



సిలిండర్లను తనిఖీ చేస్తున్న డీటీ రఘునందన్

తుర్కయంజాల్: గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడంలో డీలర్లు అప్రమత్తంగా ఉండాలని, ఏజెన్సీల్లో పనిచేసే సిబ్బంది చేసే అక్రమ దందాకు డీలర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుర్కయంజాల్‌లో ఇటీవల స్వాధీనం చేసుకున్న సిలిండర్లను నిల్వ ఉంచడం కోసం శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీకి తరలిస్తున్నట్టు చెప్పారు. కర్మన్‌ఘాట్‌కు చెందిన ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ నుంచి ఫిరోజ్ అనే వ్యక్తి 60 డొమెస్టిక్ సిలిండర్లను పక్కదారి పట్టించడంతో ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని హిందుస్థాన్ పెట్రోలియంను కోరినట్లు ఆయన తెలిపారు.



పుష్కరిణిలో చక్రతీర్థం నిర్వహిస్తున్న వేదపండితులు

ముగిసిన అనంతగిరి జాతర

అనంతగిరి: అనంతగిరి గుట్ట శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో కార్తీక మాస పెద్ద జాతర గురువారం నిర్వహించిన చక్రతీర్థంతో ముగిసింది. ఉదయం 11గంటలకు ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ మఢ వీధుల మీదుగా ఊరేగిస్తూ పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. అక్కడ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ చక్రతీర్థం వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. జాతరకు సహకరించిన అధికారులకు, భక్తులకు ఆలయం తరఫున ఈవో నరేందర్, ఆలయ ధర్మకర్త పద్మనాభం ధన్యవాదాలు తెలిపారు.

కోడెల వేలంతో రూ.లక్ష ఆదాయం

జాతరను పురస్కరించుకుని భక్తులు ఆలయానికి కోడెలను వదిలి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కోడెలకు బహిరంగ వేలం నిర్వహించడంతో ఆలయానికి రూ.లక్ష ఆదాయం సమకూరిందని ఈవో నరేందర్ తెలిపారు.

హడావుడికి ఏడాది పూర్తి

- అభివృద్ధి పేరిట గత ఏడాది డిసెంబర్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పర్యటన
- ఆ తరువాత కన్నెత్తి చూడని వైనం



శివారెడ్డిపేట్ చెరువును పరిశీలిస్తున్న రాష్ట్రస్థాయి అధికారులు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేఆనంద్(ఫైల్)

వికారాబాద్ అర్బన్: ఏడాదిలో జిల్లా కేంద్రం రూపురేఖలు మారిపోతాయి.. వికారాబాద్ పట్టణం అద్దంలా కనిపిస్తుంది.. నెల రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయి.. ఈ మాటలు అన్నది ఎవరో కాదు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్. గత ప్రభుత్వంలో కీలక శాఖల్లో పనిచేసిన ఓఎస్‌డీలతో కలిసి 2022 డిసెంబర్ 6న వికారాబాద్ పట్టణంలో హడావుడి పర్యటన చేసి యుద్ధ ప్రాతిపాదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ప్రకటించారు. వారి ప్రకటనకు ఈ నెల 6వ తేదీతో ఏడాది పూర్తయ్యింది. హామీలు గుప్పించి ఏడాది పూర్తయినా అభివృద్ధికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

భారీగా నిధులంటూ ప్రకటన

వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి అప్పటి మంత్రి కేటీఆర్ పెద్ద ఎత్తున నిధులు ఇవ్వబోతున్నారని, అతిత్వరలో జిల్లా కేంద్రం రూపురేఖలు మారబోతున్నాయని గత ఏడాది డిసెంబర్ 6న మున్సిపల్ సీడీఎంఏ సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్‌డీ మహేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆకస్మిక పర్యటనలు చేశారు. ఒకేఒక్క రోజులో అభివృద్ధి పనులకు నిధులు వస్తాయని ఊదరగొట్టారు. రాష్ట్ర స్థాయి అధికారుల బృందం ఆకస్మికంగా జిల్లా కేంద్రంలో కలియతిరగడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ హడావుడి చేసి ఏడాది గడుస్తున్నా అభివృద్ధికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ఎంపీ రంజిత్‌రెడ్డి తీరుపై వికారాబాద్ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడి ఎనిమిదేళ్లు కావస్తున్నా ఏమాత్రం అభివృద్ధి జరగలేదనే విమర్శలు ఉన్నాయి. వికారాబాద్ పట్టణ అభివృద్ధికి ఎంపీ రంజిత్‌రెడ్డి కొత్తగా నిధులేమీ తేలేదనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై ఎంపీ దృష్టి సారించక పోవడం తోనే ఆలస్యం అయ్యిందనే ప్రచారం ఉంది. ఎన్నికలు ముంచుకొచ్చే ముందు శిలాఫలకాలు వేయించారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జిల్లా కేంద్రం త్వరగా అభివృద్ధి సాధించాలని పట్టణ ప్రజలు, శివారు వార్డుల ప్రజలు కోరుతున్నారు. వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపిక కావడంతో ఈ ప్రాంత ప్రజల్లో అభివృద్ధిపై మరింత ఆశలు పెరిగాయి. ప్రధానంగా జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. వికారాబాద్ అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, నిధులు తీసుకొస్తే సరిపోతుందనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

అధ్యక్షా..

- అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్
- సముచిత స్థానం కల్పించిన కాంగ్రెస్ పెద్దలు



గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్: వికారాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం సముచిత స్థానం కల్పించింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రి పదవి వస్తుందని భావించారు. కానీ ఆయన సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ ఉండటంతో క్యాబినెట్ కూర్పులో ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. మూడో సారి ఎమ్మెల్యేగా గెలవడం, గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న అధిష్టానం పెద్దలు ఆయనకు స్పీకర్ పదవిని కట్టబెట్టారు. ప్రసాద్‌కుమార్ మర్పల్లి ఎంపీపీగా జిల్లాలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలో మొదటి సారి వికారాబాద్ నుంచి పోటీ చేసి మాజీ మంత్రి చంద్రశేఖర్‌పై గెలుపొందారు. ఆ వెంటనే 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ గెలుపొందారు. తదనంతరం ఆయన్ను మంత్రి పదవి వరించింది. ఈ తరువాత వరుసగా 2014లో దివంగత సంజీవరావ్ చేతిలో, 2018లో ఆనంద్ చేతిలో ఓటమిని చవిచూశారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మళ్లీ వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది సత్తా చాటారు..

'ఫార్మా'.. రద్దేనా?

- అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటన
- హస్తం ప్రభుత్వం రావడంతో ఏం జరుగుతుందోనని ఉత్కంఠ

యాచారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని.. న్యాయబద్ధంగా సేకరించిన భూములను రైతులకే తిరిగిచ్చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఈ క్రమంలో ఎన్నికలు ముగియడం కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకోవడం జరిగిపోయాయి. దీంతో ఇప్పుడు ఫార్మా అంశం చర్చనీయాంశమైంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2017 నుంచి ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తూ ఆయా గ్రామాల్లో 10 వేల ఎకరాలకుపైగా అసైన్డ్, పట్టా భూములను సేకరించింది. పట్టా భూములకు ఎకరాకు రూ.16 లక్షలు, అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.8 లక్షలు, అసైన్డ్ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు ఎకరాకు రూ.7.70 లక్షలు చెల్లించింది. పలు పేరొందిన ఫార్మా కంపెనీలకు వందల ఎకరాల కొద్ది భూములను కూడా అప్పగించింది. అయితే ఫార్మా కంపెనీలను తెచ్చి ఈ ప్రాంతాన్ని నాశనం చేయొద్దని మొదటి నుంచీ స్థానికులుతో పాటు ప్రతిపక్ష నాయకులు వ్యతిరేకిస్తూ వచ్చారు.

రూ. కోట్లలో 'రియల్' పెట్టుబడులు

ఫార్మాసిటీని గొప్పగా చూపిస్తూ, దండిగా ఆదాయం పొందాలనే సంకల్పంతో రియల్‌వ్యాపారులు నాగార్జునసాగర్ హైవేపై ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నందివనపర్తి, యాచారం, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, నస్దిక్‌సింగారం, మొండిగౌరెల్లి, చింతపట్ల, మాల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, పెద్దతుల్ల, ఆగాపల్లి, గునుగల్ తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేశారు. శ్రీశైలం హైవే మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు, మీరాఖాన్‌పేట, దాసర్లపల్లి, దెబ్బడగూడ, ముచ్చర్ల, కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని కడ్తాల్, మైసిగండి, ఆమనగల్లు, కర్కల్‌పహాడ్, ముద్వీన్, కొల్కులపల్లి, మాడ్గుల, తలకొండపల్లి తదితర గ్రామాల్లో 20వేలకు పైగా ఎకరాల్లో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేశారు. కొన్ని గ్రామాల్లో తక్కువ ధరలకు గుట్టలున్న భూములను సైతం కొనుగోలు చేసి డెవలప్ చేశారు. ఏడాది క్రితం వరకు రియల్ వ్యాపారం జోరుగా సాగింది.

చికెన్ ఫ్రైలో బొద్దింకలు !

పేరుకు అది పెద్ద హోటల్.. జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారు ఇక్కడే బిర్యాని తింటుంటారు. కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉంటుంది. పేరున్న హోటల్ కదా అని అక్కడ ఏమైనా తిన్నామా అంటే మన పరిస్థితి అంతే.. గురువారం ఆ హోటల్‌లో వెలుగు చూసిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం.

- కుళ్లిన మాంసంతో వంటలు
- ఇదీ స్వాగత్ హోటల్ నిర్వాకం
- ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు



చికెన్ కర్రీలో బొద్దింక



కుళ్లిపోయిన చికెన్

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని కలెక్టరేట్‌కు సమీపంలో స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఉంది. వివిధ పనుల నిమిత్తం జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వికారాబాద్‌కు వస్తుంటారు. పేరున్న హోటల్ కావడంతో స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో భోజనం, బిర్యానీ, చికెన్ తినడానికి ఆసక్తి చూపుతారు. ఇంతవరకు బాగానే ఉన్నా పైన పటారం.. లోన లొటారం అన్న చందంగా ఉంది ఈ హోటల్ పరిస్థితి. చికెన్ కర్రీలో బొద్దింకలు, కుళ్లిన చికెన్‌తో వంటలు తయారు చేసి కస్టమర్లకు వడ్డిస్తూ వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గురువారం డీఈఓ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్, సంపత్ మరికొంత మందితో కలిసి భోజనం చేసేందుకు స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు వెళ్లారు. చికెన్ ఫ్రై ఆర్డర్ ఇచ్చారు. సర్వర్ చికెన్ ఫ్రై తేవడంతో తినడం ప్రారంభించారు. అందులో రెండు బొద్దింకలు కనిపించడంతో ఆందోళన చెందారు. హోటల్ మేనేజర్‌ను పిలిచి ఏంటిదని ప్రశ్నించారు. అనుకోకుండా పడి ఉంటాయని, చిన్నచిన్న పొరపాట్లు జరుగుతుంటాయని, ఇంట్లో అయితే పురుగులు తీసేసి తింటాం కదా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో సదరు కస్టమర్లు హోటల్‌లోని కిచెన్‌లోకి వెళ్లి ఫ్రిజ్‌ను తెరిచి చూడగా విస్తుపోయారు. కుళ్లిన చికెన్ కనిపించాయి. ఇదేమిటని అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా చికెన్ బాగుందని బుకాయించారు. దీనిపై సదరు హోటల్ మేనేజర్, యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కస్టమర్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు నిత్యం వందలాది మంది వచ్చి భోజనం చేస్తుంటారని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: మోమిన్‌పేట పీఏసీఎస్ ఆవరణలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. తేమ 17 శాతం లోపు ఉండి, తాలు లేకుండా శుభ్రంగా ఉండాలన్నారు. రైతులు టోకెన్‌లు తీసుకొని ఇచ్చిన తేదీ ప్రకారం ధాన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర ధాన్యం గ్రేడు ఏ రకం క్వింటాలుకు రూ.2,203లు, గ్రేడు బి రకం రూ.2,183లకు కొనుగోలు చేస్తామన్నారు. మేకవనంపల్లి, రాళ్లగుడుపల్లి, కాస్లబాదు తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేశారన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సహకరిద్దాం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న పర్వతరెడ్డి

పరిగి: ప్రభుత్వానికి సహకరిస్తూ సమస్యలను పరిష్కరించుకుందామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వంతో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, బకాయిలుగా ఉన్న డీఏలు, 317 జీఓకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమగ్రంగా విచారణ చేపట్టి సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షఫీ, నాయకులు బసిరెడ్డి, దయాకర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్ ఏదీ?



గాంధీపార్కులో బస చేసి రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న యాత్రికులు

- మున్సిపల్ ఖాతాలో రూ. 45 లక్షలు నిధులు
- 800 గజాల స్థలం కేటాయింపు
- మూడేళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత జనాల రాకపోకలు బాగా పెరిగాయి. జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు తరుచుగా వస్తున్నారు. ఈ మధ్యకాలంలో అన్నీ హంగులతో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది. అంతే కాకుండా వికారాబాద్‌లో రైల్వే జంక్షన్ ఉండటంతో పలు రకాల రైళ్లు ఎక్కువ సమయం ఆగుతుంటాయి. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన యాత్రికులు రైల్వేస్టేషన్‌లో గంటల తరబడి బస చేస్తుంటారు. యాత్రికులు అత్యధికంగా స్టేషన్‌కు పక్కనే ఉన్న మల్లికార్జున దేవాలయంలో రుసుం చెల్లించి రాత్రి బస చేస్తున్నారు. మరి కొందరు పట్టణంలోని లాడ్జిల్లో బసచేస్తున్నారు. కొందరు పక్కనే ఉన్న గాంధీ పార్కులో సమయం గడిపి తిరిగి ట్రైన్‌కు, బస్సులకు వెళ్లిపోతున్నారు. నైట్ షెల్టర్ నిర్మిస్తే వీరందరికి ఎంతో మేలు జరగనుందని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి

నైట్ సెల్టర్ నిర్మించేందుకు రూ.45 లక్షలు ప్రభుత్వం 2020లో మంజూరు చేసింది. మూడు ఏళ్లుగా ఈ నిధులు మున్సిపల్ ఖాతాలోనే మూలుగుతున్నాయి. రైల్వే స్టేషన్, వ్యవసాయ మార్కెట్, జిల్లా కేంద్రంలోని ప్రధాన వ్యాపార సముదాయాలకు దగ్గరగా ఉండే రైతు బజారు స్థలంలో నైట్ సెల్టర్ నిర్మించేందుకు మున్సిపల్ పాలకమండలి తీర్మానం కూడా చేసింది. ఈ మేరకు సెల్టర్ నిర్మాణానికి అవసరమైన 800 గజాల స్థలాన్ని కూడా కేటాయించారు. గత రెండు ఏళ్ల క్రితం రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు దాని ఊసెత్తడం లేదు.

'గిరి ప్రదక్షిణ'కు మహత్తర శక్తి



గిరిప్రదక్షిణలో మహరాజ్‌తో కలిసి నడుస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి
- 24 కిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్న భక్తులు



గిరిప్రదక్షిణలో భాగంగా మాణిక్ ప్రభు మహరాజ్‌తో ఎమ్మెల్యే కాలె యాదయ్య

అనంతగిరి: అనంతగిరి గుట్ట.. గిరి ప్రదక్షిణకు మహత్తరమైన శక్తి ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మాణిక్‌ప్రభు సంస్థాన్, హిందూ జనశక్తిల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 6గంటలకు ప్రారంభమైన 24 కిలోమీటర్ల ప్రదక్షిణ సాయంత్రం ముగిసింది. అనంతరం మాణిక్‌ప్రభు సంస్థాన్(నవాబ్‌పేట) పీఠాధిపతి బాల మార్తాండ మహరాజ్ మాట్లాడుతూ.. అనంతగిరి పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. సుందరమైన అడవిని రక్షించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్ మాట్లాడుతూ.. నగరానికి సమీపంలో ఉన్న అనంతగిరి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని కోరారు. వచ్చే ఏడాది నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, హిందూ జనశక్తి జిల్లా అధ్యక్షుడు సారా జగన్, కన్వీనర్ వెంకటేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీనియర్ న్యాయవాది గోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, గీతావాహిని అధ్యక్షురాలు శ్రీదేవి, విజయ్‌రాజ్, ఆనంద్, సుధీర్, సతీష్ వికారాబాద్, నవాబ్‌పేట, సదాశివపేట, పరిగి తదితర ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి హెచ్చరించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జయలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ పీపీ యూనిట్ వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు గ్రామాల్లో తిరిగి గర్భవతులను గుర్తించి, వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. అలాగే వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణీలు ఎనిమియా వ్యాధి బారిన పడకుండా ఏఎన్‌ఎంలు టీటీ వ్యాక్సినేషన్, ఐరన్ ఫోలిక్ మాత్రలను పంపిణీ చేయాలని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలకు పౌష్టికాహారం, ఆహారపు అలవాట్ల గురించి వివరించాలని తెలిపారు. వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రతి సబ్ సెంటర్‌లోని ఫీల్డ్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. రిజిస్టర్లను సరిగా పూర్తిచేయని ఏఎన్‌ఎంలను మందలించారు. సిబ్బంది విధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్ హరికిషన్, డాక్టర్, ఆనం నజీమ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శ్రీహరి, రవికుమార్, అమృత, అనసూయ, ఝాన్సీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న తాండూరు ప్రజలు, నాయకులు

తాండూరు రూరల్: వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పదవీని కాంగ్రెస్ అధిష్టానం కట్టబెట్టింది. ప్రసాద్‌కుమార్ స్వగ్రామం తాండూరు మండలం, బెల్కటూర్ గ్రామం. ఆయన తల్లి ఎల్లమ్మ పాలు అమ్మేది. కొన్ని సంవత్సరాలు తాండూరు పట్టణంలోని కుమ్మరిగల్లీలో నివాసముండేవారు. ప్రసాద్ కుమార్ వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది...మంత్రిగా కూడా పని చేశారు. ప్రస్తుతం స్పీకర్‌గా పదవీ రావడంతో బెల్కటూర్‌తో పాటు తాండూరు పట్టణంలోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బెలకటూర్‌లో ఆయనకు సొంత వ్యవసాయ భూమి ఉంది.

నేడు ధారూరుకు ప్రత్యేక రైలు రాక

ధారూరు: కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి ధారూరుకు ప్రత్యేక రైలు వేయడం జరిగిందని, శుక్రవారం ఉ.10 గంటలకు బీదర్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1: 33 గంటలకు ధారూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఈ రైలు జహీరాబాద్, కోహీర్, సదాశివపేట్‌రోడ్, వికారాబాద్, గోదంగూడ, మైలారం స్టేషన్లలో ఆగితుందని ఆయన వివరించారు. తిరిగి ఆదివారం ధారూరు రైల్వేస్టేషన్ నుంచి బీదర్‌కు బయలుదేరుతుందని పేర్కొన్నారు.

జాతరకు భారీ బందోబస్తు



ధారూరు: జాతర విధుల్లో చేరడానికి వచ్చిన పోలీసు సిబ్బంది

ఐదుగురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 27 మంది ఎస్‌ఐలు

ధారూరు: మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గురువారం ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 27 మంది ఎస్‌ఐలు, 44 ఏఎస్‌ఐలు, మహిళా పీసీలు 26 మంది, ఇతర పీసీలు 112, హోంగార్డులు 55 మంది జాతర బందోబస్తులో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, జాతర ఆవరణ మొత్తం 24 గంటలు సీసీ కెమెరాల నిఘాలో ఉందని తెలిపారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విష్ణువర్ధన్

షాద్‌నగర్: పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో నిర్వహించే ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు షాద్‌నగర్ పట్టణంలోని ఎస్వీపీ డిగ్రీ కళాశాల బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికయ్యాడు. పాలమూరు యూనివర్సిటీలో ఆర్చరీ క్రీడల సెలక్షన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన విష్ణువర్ధన్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మారం శ్రీనివాస్ తెలిపారు. పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో ఈనెల 19 నుంచి 22 వరకు నిర్వహించే పోటీల్లో విష్ణువర్ధన్ పాల్గొననున్నారు.

కొడుకును కొట్టి చంపిన కసాయి తండ్రి

మహేశ్వరం: క్షణికావేశంలో కన్న కొడుకును ఓ కసాయి తండ్రి కొట్టి చంపాడు. ఈ ఘటన మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో బుధవారం రాత్రి జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా సిబెలగల్ మండలం రంగాపురం గ్రామానికి చెందిన సంధ్యపోగు శివ, లతలకు గత ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరు ఉపాధి కోసం కర్నూల్ నుంచి వచ్చి మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట్‌లో ఉంటున్నారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు.. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెలు ఉన్నారు. శివ మద్యం, చెడు వ్యసనాలకు బానిసై నిత్యం భార్య లతతో గొడవ పడేవాడు. బుధవారం రాత్రి లత కూరగాయలు తీసుకురావాడానికి చిన్న కుమారుడు, కుమార్తెను తీసుకొని వెళ్లగా, మరో కుమారుడు సంజు(3)ఇంటి వద్ద తండ్రి వద్ద విడిచి వెళ్లింది. సంజు గట్టిగా ఏడవడంతో తండ్రి శివ కోపంతో పొట్ట, తలపై బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత తల్లి, చుట్టూ పక్కల వారు గమనించి చూడగా అప్పటికే సంజు మరణించాడు. తల్లి లత లబోదిబోమని విలపించడంతో గమనించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



బంట్వారం: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం సర్కారు బడులను మరింతగా బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చే యాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సబితారెడ్డికి శుభాకాంక్షలు



సబితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యమకారులు

పహాడీషరీఫ్: మహేశ్వరం నియోజకవర్గంలో తొలిసారిగా బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేసి భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి గురువారం ఉద్యమకారులు శుభాకాంక్షలు తెలియజేశారు. బొమ్మెరబోయిన యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు ఆమె నివాసంలో కలిసి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో దయానంద్, వెంకటాచారి, సుధాకర్, సయ్యద్ ఫెరోజ్ అహ్మద్, సలీం, నరసింహ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం



మృతురాలు సర్వాబి (ఫైల్)

తాండూరు టౌన్ : అదృశ్యమైన ఓ మహిళ మృతదేహంగా లభ్యమైంది. తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా మద్కల్ గ్రామానికి చెందిన సర్వాబి (42), ప్రతి రోజు పని నిమిత్తం తాండూరు శాంత్‌మహల్ చౌరస్తాలోని అడ్డా మీదికి వచ్చేది. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి తాండూరుకు వచ్చిన ఆమె తిరిగి వెళ్లలేదు. దీంతో ఆమె భర్త మహమూద్ ఈనెల 1వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ సందర్భంగా గురువారం సర్వాబి మృతదేహం తట్టేపల్లి అడవిలో కుళ్లిన స్థితిలో లభ్యమైంది. ఈ మేరకు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు ఆమె ధారూర్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన కిష్టప్పతో ఇందిరాచౌక్ వైపు వెళ్లినట్లు కనపడింది. దీంతో కిష్టప్పను అదుపులోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాల్ ప్రత్యేక మండలం అయ్యేనా?



సాగర్‌రోడ్డుపై ఉన్న మాల్ వ్యాపార కేంద్రం



రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం

- కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ఆశలు
- వైఎస్సార్ హయాం నుంచి డిమాండ్
- వ్యాపారపరంగా దినదినాభివృద్ధి
- మండలం ఏర్పాటు చేసి రంగారెడ్డిలో కలపాలని విజ్ఞప్తి

యాచారం: రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం మాల్‌ను ప్రత్యేక మండలంగా గుర్తించాలనే ప్రజల డిమాండ్ కలగానే మిగిలింది. తాజాగా కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మాల్ ప్రత్యేక మండల ఏర్పాటుపై ప్రజల్లో మళ్లీ ఆశలు రేకెత్తించాయి. నాగార్జున సాగర్- హైదరాబాద్ రహదారిపై రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నల్గొండ జిల్లా చింతపల్లి మండలం సరిహద్దులో మాల్ గ్రామం ఉంది. రెండు జిల్లాలు, రెండు మండలాల పరిధిలో ఉన్నా ఈ కేంద్రాన్ని మాల్, వెంకటేశ్వర్‌నగర్, పెరుకోనిబాయి అనే మూడు పేర్లతో పిలుస్తారు. రెండు జిల్లాల సరిహద్దులో రెండు మండలాల పరిధిలో ఒకే చోట మాల్ కేంద్రం వ్యాపార, వాణిజ్యపరంగా ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోనే పేరుగాంచింది. మాల్ వ్యాపార కేంద్రంలో నిత్యం రూ. 20 కోట్లకు పైగానే వ్యాపార, ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతారు. ప్రతి మంగళవారం యాచారం మండలంలోని పశువుల అంగడి, సంత జరుగుతుండడంతో ఆ రోజు రూ. 50 కోట్లకు పైగానే వ్యాపార ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. ఇంతా ప్రాముఖ్యత కలిగిన కేంద్రాన్ని గుర్తించే విషయంలో పాలక పక్షాలు శ్రద్ధ పెట్టకపోవడం ప్రజలకు శాపంగా మారింది. నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల గ్రామాలను కలిపి మాల్‌ను ప్రత్యేక మండలం ఏర్పాటు చేసి రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ హయాం నుంచి ..

రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దు మాల్‌ను ప్రత్యేక మండలంగా గుర్తించాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అప్పటి హోంమంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు వైఎస్‌ను కలిసి మాల్‌ను ప్రత్యేక మండలంగా గుర్తించాలని వినతి పత్రం కూడా ఇచ్చారు. ప్రత్యేక మండలంతో పాటు మాల్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి. ప్రత్యేక తెలంగాణ అనంతరం సీఎం కేసీఆర్ పలు జిల్లాల్లోని పలు ప్రాంతాలను ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేయడంతో మాల్‌కు గుర్తింపు ఇవ్వాలని స్థానికులు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు, అధికార, ప్రతిపక్ష పార్టీలకు వినతి పత్రాలు ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని పలు మండలాలను ఏర్పాటు చేశారు. కానీ, వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందిన మాల్‌ను మాత్రం చేయలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉన్న ఇబ్రహీంపట్నం, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందడం పట్ల స్థానికుల్లో మళ్లీ ప్రత్యేక మండలంపై ఆశలు ఏర్పడ్డాయి.

మరింత అభివృద్ధి ..

మాల్ కేంద్రాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేస్తే వ్యాపారపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, మాల్, తమ్మలోనిగూడ, కేసీతండా గ్రామ పంచాయతీలు, నల్గొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్, గొడుకొండ్ల, పాలేపల్లి, మర్రిగూడ మండలం ఎరుగండ్లపల్లి, తిరుగండ్లపల్లి తదితర గ్రామ పంచాయతీలను కలిపి ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్. యాచారం, చింతపల్లి మండలాల సరిహద్దులో ఉన్న మాల్ కేంద్రంలో దాదాపు 30 వేలకు పైగానే జనాభా ఉంది. వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందడంతో పాటు ఏటా వందలాది ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రత్యేక మండలం ఏర్పాటు చేస్తే మాల్ గ్రామంలో కావాల్సిన ప్రభుత్వ స్థలం ఉంది.